


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మ మనసు

**"ఎర్రకోక కట్టినావె పిట్టా"**

అరుగు మీద కూర్చుని జాకెట్‌కి హుక్స్ కుట్టుకుంటున్న మాలతి తలెత్తి చూసింది. సూరీడు ఆమె వంక నవ్వుతూ చూస్తున్నాడు.

"ఛీ" ఆమె లేచి లోపలికి వెళ్ళిపోయింది.

పక్కనే కూర్చుని పలకమీద అక్షరాలు దిద్దుకుంటున్న బాలూ ఆమెని అనుసరించాడు.

"నువ్వు పదన్నా. ఆడ లేడీస్‌తో మనకెందుకు?" సూరీడు వెనక తోకలా తిరిగే మస్తాను వారించాడు.

సూరీడు అనవసరంగా పెద్దగా నవ్వి వాడి భుజం మీద చరిచి ఎదురింటి గోడమీద కాండ్రించి ఉమ్మేసాడు. ఎర్రటి చార గోడమీంచి కిందికి జారింది.

పద్నాలుగేళ్ళ మస్తాను భుజం తడుముకుని వెర్రినవ్వు నవ్వాడు.

"ఈ మాయదారి సంతతో వేగలేకపోతున్నా. చస్తే బాగుండు" ఎదురింటి ఆవిడ తిట్టుకుంటూ గోడమీద బక్కెట్ నీళ్ళు కుమ్మరించింది.

"వంటైందా?" వెంకటరమణ చెప్పులు విప్పుతూనే అడిగాడు.

"ఆఁ. కాళ్ళు కడుక్కురా" మాలతి కంచాలు పెడ్తూ చెప్పింది.

"నీ బాబింటికి వెళ్ళావా?" కంచం ముందు కూర్చుంటూ అడిగాడు.

"ఎవడు చెప్పాడు? వెళ్తే ధైర్యంగా వెళ్తా. దొంగచాటుగా పోనని నీకెన్నిసార్లు చెప్పాను?" కోపంగా అరిచింది.

"టెస్ట్. వెళ్ళావో లేదో అని టెస్ట్ చేసా. ఏరా బడుద్దాయ్! మీ అమ్మ ఇంట్లోంచి బయటకి వెళ్ళిందా?" పక్కన కూర్చున్న బాలూ నెత్తిన మొట్టికాయ వేసి అడిగాడు.

వాడు లేచి తండ్రికి దూరంగా కూర్చున్నాడు.

"ఎందుకు ఉత్త పుణ్యానికి వాడిని కొడతావ్?" మాలతి వాడి తల నిమురుతూ అరిచింది.

"మీ నాన్నని కొట్టలేక."

"ఐతే మాత్రం కన్నకొడుకుని కూడా చూడవా? బొప్పి కట్టింది."

వెంకట రమణ పెద్దగా నవ్వాడు.

"ఐదువేల బాకీ ఏడేళ్ళయినా తీర్చలేదు. ఇంత దరిద్రుడనుకోలేదు నీ బాబు." గిన్నెలోని కూరంతా కుమ్మరించుకుని అన్నం కలుపుకుంటూ చెప్పాడు.

"వీడికి కూడా కొంచెం కూరెయ్. నాకు లేకపోయినా పర్లేదు" కోరింది.

వెంకటరమణ మాట్లాడకుండా తిని లేచి చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు.

మాలతి విడిగా దాచిపెట్టిన కూరగిన్నె తెచ్చి, బాలూకి అన్నం పెట్టింది.

"మాలా! ఏంటీ రమణ మళ్ళీ గొడవ చేస్తున్నట్టున్నాడు?" పక్కింటావిడ సొరకాయతో లోపలకి వస్తూ అడిగింది.

"మమూలేగా అక్కా. ఇవ్వలేనివాడు మా నాన్న ఐదువేల కట్నం ఇస్తానని ఎందుకొప్పుకున్నట్లు? పోనీ ఈ మనిషేమైనా గవర్నమెంట్ జాబ్ చేస్తున్నాడా చెప్పు. మిల్లులో పని. దీనికోసం పదో తరగతి ఫస్టున పాసైనదాన్ని చదువు మాన్పించి మరీ పెళ్ళి చేసాడు. అమ్మా నాన్నలని చూసి ఆరేళ్ళయింది. వీడు పుట్టాక మళ్ళీ పుట్టింటి గడప తొక్కలేదు. రోజూ పొద్దున్న, మధ్యాహ్నం, సాయంత్రం ఆరాలు. 'నువ్వు పొయ్యావా, మీ నాన్న వచ్చాడా' అని. విసుగేస్తుందనుకో" మాలతి దిగులుగా చెప్పింది.

"పిల్లాడని కూడా చూడకుండా వీడ్ని కొడతాడు పాపం" ఆమె సానుభూతిగా చెప్పింది.

"మా నాన్న కట్నం సొమ్ము ఇచ్చేదాకా ఇంతే."

"ఇంకోసారి కడుపుతో ఉంటే, ఖర్చుని పుట్టింటికి పంపేవాడు. వీడి తర్వాత మళ్ళీ నువ్వు నెల తప్పలేదు. సఖ్యంగా ఉంటాడా?" ఆవిడ గొంతు తగ్గించి అడిగింది.

"ఆహా! దానికేం తక్కువలేదు" మాలతి నిరసనగా చెప్పింది.

"మరి వీడికి ఆరేళ్ళు దాటాయి. ఇంకో పిల్లో పిల్లాడో ఉంటే బాగుంటుందిగా మాలా" ఆవిడ సలహా ఇచ్చింది.

మాలతి ఏం మాట్లాడలేదు.

"మా దొడ్లో సొరకాయ వండుకుంటావని తెచ్చా" పక్కింటావిడ వెళ్ళిపోయింది.

మాలతి అరుగుమీద కూర్చుని లాంతరు గ్లాస్‌ని ముగ్గుతో తోముతోంది. పోలీసులతో వెళ్తున్న సూరీడు వెకిలిగా నవ్వి అడిగాడు.

"రవణన్న కరెంట్ బిల్లు కూడా కట్టట్లేదా?"

"నువ్వు నోర్ముయ్యరా" ఓ కానిస్టేబుల్ లాఠీతో అతన్ని పొడిచాడు.

"మళ్ళీ ఎప్పుడొస్తావన్నా" వాళ్ళు వెనక నడుస్తున్న మస్తాన్ అడిగాడు.

"ఈ సారి ఆర్నెల్లకి తగ్గదు" కానిస్టేబుల్ సమాధానంగా చెప్పాడు. వాళ్ళు సూరీడుని వీధి చివర ఆపిన జీప్‌లోకి ఎక్కించారు. జీప్ వెళ్ళిపోయింది. మస్తాన్ మిగిలిపోయాడు.

"మళ్ళీ ఏం చేస్మాడ్రా ఎదవ?" ఎదురింటావిడ ఆసక్తిగా ఆడిగింది.

"ఎవరిదో మేకపోతు కనపట్టం లేదంట. అమ్మతోడు. సూరీడు ఎత్తుకెళ్ళలా" మస్తాన్ తలమీద చెయ్యి పెట్టుకుని చెప్పాడు.

"పీడ వదిలింది. ఆర్నెల్ల పాటు హాయిగా ఉండచ్చు." ఆవిడ లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది.

వెంకట రమణ కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్న మాలతి అతన్ని చూడగానే దుఃఖంగా చెప్పింది.

"అమ్మకి అసలు బాగుండలేదుట. ఓసారి వెళ్ళొస్తా."

వెంకటరమణ నిదానంగా ఒక్కో గుండీ విప్పి చొక్కాని మేకుకి తగిలించాడు. తర్వాత తాపీగా పేంట్ విప్పి లుంగీ కట్టాడు.

ఉక్రోషంతో ఉడికి పోతున్న మాలతి మౌనంగా చూస్తూండిపోయింది.

"వెళ్ళి ఐదువేలు పట్రా. తర్వాత నీ ఇష్టమొచ్చినన్ని రోజులు ఉండు." ఆమె అందించిన కాఫీ గ్లాస్‌తో అరుగు మీద కూర్చున్నాడు.

మాలతి వంటగదిలోకి వెళ్ళిపోయింది. ఏడుపుని ఆపుకోవడంతో గొంతు మంటగా ఉంది.

అతన్ని మరోసారి అడగదల్చుకోలేదు. 'చేరి మూర్ఖుల మనసు రంజింపచేయలేం' పదో తరగతి పాఠాన్ని గుర్తు చేసుకుంది.

బాలూ ఏడుస్తూ వచ్చాడు.

"ఏమైంది?" నిర్లిప్తంగా అడిగింది.

భర్త కొట్టి వుంటాడని ఆమెకి తెలుసు.

బాలూ చొక్కా పైకెత్తి చూపించాడు. వాడి వీపు మీద అరచేతి గుర్తు ఎర్రగా పడింది.

వాడిని ఒళ్ళో పడుకోపెట్టుకుని కొబ్బరి నూనె రాసింది. ఆమెకి భవిష్యత్తు అంధకారంగా ఉంది. తన తండ్రి జీవితంలో ఆ డబ్బు ఇవ్వలేడు. ఇచ్చేదాకా వెంకటరమణ అలాగే ప్రవర్తిస్తాడు. మధ్యలో తనూ, బాలూ బాధలు పడుతున్నారు. ఇలాంటి వాతావరణంలో పెరిగిన కుర్రాడు పెద్దయ్యాక మస్తాన్‌లాగే తయారవుతాడు. లేదా ఇంకో వెంకటరమణ.

ఆ రాత్రి వెంకటరమణతో చెప్పింది.

"నేను పని చేస్తాను. ఐదువేలు సంపాదించాక మానేస్తాను."

అతను ఓ క్షణం నివ్వెరపోయాడు. తర్వాత పెద్దగా నవ్వాడు.

"ఐదువేలు ఇప్పుడు వడ్డీతో పదివేలయ్యాయి. ఏ పనిచేస్తావ్? అంట్లు తోముతావా?"

"ఆఫీసుల్లో చేస్తా" ఉక్రోషంగా చెప్పింది.

"అబ్బో! పదో తరగతి పాసైనవాళ్ళకి ఆఫీసుల్లో పనిస్తారా? కలెక్టర్ పనా?" వెటకారంగా అడిగాడు.

"ఏదొకటి"

"కాళ్ళిరక్కొడతా. బుద్ధిగా ఇంట్లో పడుండు" రౌద్రంగా చెప్పాడు.

ఆ రాత్రి మాలతికి నిద్రపట్టలేదు.

మస్తాన్ అరుగు మీద కూర్చుని బాలూతో ఆడుకుంటున్నాడు.

"ఏరా! వాడింకా బయటకి రాలేదా?" ఎదురింటావిడ ఆరాగా అడిగింది.

"వాడికి జైల్లో టి.బి వచ్చిందంట. మంగళగిరి ఆస్పటల్‌కి పంపారంట" మస్తాన్ దిగులుగా చెప్పాడు.

"దరిద్రం పోయింది" ఆవిడ మెటికలు విరుస్తూ చెప్పింది.

మాలతికి ఓ క్షణం అయ్యో అనిపించింది.

"ఎలా ఉందిట?" అడిగింది.

"నెలకన్నా ఎక్కువ బతకడన్నాడమ్మా ఆ పోలీసాయన" వాడికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మాలతి ఆ రోజు, మర్నాడు ఆలోచిస్తూనే ఉంది. తల్లిపోయి నెలదాటుతోంది. వెంకటరమణ చివరి చూపుకి కూడా పంపలేదు. ఏడ్చి స్నానం చేసిందంతే. తండ్రి ఏ పరిస్థితిలో ఉన్నాడో తెలీదు కాని ఆయన ఇవాళో రేపో అన్నట్టున్నాడని ఇరుగు పొరుగు చెప్పారు.

మాలతి పూర్తిగా వెంకటరమణతో మాటలు మానేసింది. అతను అడిగిన దానికి జవాబు చెప్తుందంతే.

ఇంట్లో పని పూర్తయ్యాక మధ్యాహ్నాలు ఎదురింటికి వెళ్ళి ఈనాడు పేపర్ తెచ్చుకుని చదువుతుంది. ఇరుగు పొరుగుతో కూడా మాటలు తగ్గించింది.

ఇరవై రోజుల తర్వాత వెంకటరమణ మిల్లుకి వెళ్ళగానే మాలతి గబగబా అన్నం తిని బాలూకి తినిపించింది. తల దువ్వుకుని శుభ్రమైన చీర కట్టుకుంది. బాలూని కూడా తయారు చేసి, ఇంటి తలుపు దగ్గరకి వేసి వేగంగా బస్టాండ్ వైపు నడిచింది.

ఆగి ఉన్న ఓ బస్ ఎక్కి వెనక సీట్లో కూర్చుంది. బాలూకి బస్ ఎక్కడం అదే మొదటిసారి. వాడు కళ్ళు పెద్దవి చేసుకుని బస్ కిటికీలోంచి బయటకి చూస్తున్నాడు.

దాదాపు మూడు గంటల తర్వాత ఆ పాసెంజర్ బస్ గమ్యానికి చేరుకుంది.

మాలతి బస్ దిగి, బస్టాండ్‌లో అరటిపళ్ళు అమ్మే అతనితో మాట్లాడి, బాలూ చెయ్యిపట్టుకుని బయటకి నడిచింది.

"చాలా దూరం నడవాలి. నడుస్తావా? కాళ్ళు నెప్పులు పుడితే చెప్పు ఎత్తుకుంటాను" వాడితో చెప్పింది.

వాడు తలాడించాడు. దారి లో ఒకరిద్దరిని అడిగి, గంట తర్వాత ఓ పెద్ద కట్టడం ముందుకి వచ్చి ఆగారు. గేటుకి భవనానికి మధ్య చాలా దూరం ఉంది.

వాళ్ళని చూసి గేట్ కీపర్ లాఠీ అడ్డుపెట్టి చెప్పాడు.

"పిల్లల్ని లోపలకి రానివ్వం. టిబి అంటు వ్యాధి. పిల్లలకి చప్పున అంటుకుంటుంది."

"ఒక్కసారి పంపు అన్నా. ఒక్క నిమిషమే" మాలతి బతిమాలింది.

అతను ఒప్పుకోలేదు.

"సరే. నేనే పొయ్యొస్తా. వీడిని ఆ మొక్కల దగ్గర అరుగు మీద కూర్చో పెడతా. ఇక్కడ వదిలితే, ఎటైనా పోతే కష్టం అన్నా" ప్రాధేయపడింది.

అతను మెత్తబడ్డాడు.

"సరే. పో. లోపలకి మాత్రం తీసుకెళ్ళద్దు. నర్స్ చూస్తే నిన్నూ నన్నూ కూడా చంపేస్తుంది" చెప్పాడు.

అంతవరకు ధైర్యంగా ఉన్న మాలతి బెరుగ్గా ఆ శానిటోరియంలోకి నడిచింది. ఓ చెట్టుకింద బాలుని కూర్చో పెట్టి చెప్పింది.

"ఇప్పుడే వస్తాను. ఇక్కడ నించి కదలొద్దు. తప్పి పోతావు."

ఆమె చీర కొంగుని ముక్కుకి అడ్డుగా పెట్టుకుని లోపలకి అడుగుపెట్టింది. అదొక జనరల్ వార్డ్. మంచాల మీద జీవచ్ఛవాల్లా మనుషులు పడుకుని ఉన్నారు. మంచాల పక్కన మట్టి నింపిన ముంతలున్నాయి. దగ్గినప్పుడు అందులో ఉమ్మేస్తూ నిస్పృహాయంగా పడివున్న వాళ్ళని చూస్తే ఆమెకి మనసు ద్రవించింది.

మగవాళ్ళ వార్డ్‌లోని అందర్నీ తేరిపార చూసింది. గది చివర గోడకి ఆనించి వున్న మంచం మీద కనిపించాడు సూరీడు. ఆజానుబాహుడైన అతను అస్తి పంజరంలా ఉన్నాడు.

ఆమె వెనక్కి తిరిగి బాలూ దగ్గరకి వచ్చి వాడి చెయ్యి పట్టుకుని బిల్డింగ్ వెనక వైపుకి తీసుకెళ్ళి, అక్కడి అరుగుమీద కూర్చోపెట్టి, ఓ కిటికీ చూపించి చెప్పింది.

"నేను లోపలకి వెళ్ళి ఆ కిటికీలోంచి నిన్ను పిలుస్తాను. రా" వాడు తలూపాడు.

మాలతి మళ్ళీ చెంగుని అడ్డు పెట్టుకుని లోపలకి వెళ్ళింది.

"ఎవరు కావాలి?" ఓ కుర్చీలో కూర్చుని వున్న నర్స్ అడిగింది.

వేలితో సూరీడుని చూపించింది.

"వెళ్ళు. జాగ్రత్త. దూరంగా ఉండు" నర్స్ హెచ్చరించింది.

"సూరీడూ" మాలతి అతని దగ్గరకి వెళ్ళి మృదువుగా పిలిచింది. అతను కళ్ళు తెరిచి ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఎలా ఉంది?" సానుభూతిగా అడిగింది.

తలూపి కళ్ళు మూసుకున్నాడు. కనుకొలకుల్లోంచి నీరు కారింది.

మాలతి దీర్ఘశ్వాస తీసుకుని అడిగింది.

"నేను గుర్తున్నానా? నా పెళ్ళి రేపనగా ఇవాళ నన్ను చెరిచావు. నా మొగుడి జీవితంలోకి కన్యగా వెళ్ళకుండా చేసావు."

సూరీడు బదులు చెప్పలేదు.

"నాకేం చేయాలో తోచలేదు. నువ్వు వెళ్ళాక శుభ్రంగా స్నానం చేసానంతే. మర్నాడు పెళ్ళి పీటల మీద కూర్చున్నాను. ఆ రహస్యాన్ని నాతోనే ఉంచుకున్నాను. మా ఇంటి మీదుగా వెళ్తున్నప్పుడల్లా నువ్వు వెకిలిగా చూడడమో, పాటలు పాడటమో చేసేవాడివి. నువ్వు నోరు జారతావని భయపడి చచ్చేదాన్ని. వెంకటరమణ నీకన్నా దుర్మార్గుడు. కాని రాను రానూ నువ్వు ఆ విషయం ఎవరికీ చెప్పవని అర్థమైంది. థాంక్స్"

"అది చెప్పడానికి వచ్చావా?" సూరీడు గొంతు పెగుల్చుకుని అడిగాడు.

"అవును. ఇంకొకందుకు కూడా. నీకు ఎవరూ లేరని నాకు తెలుసు. నువ్వు చస్తే ఏడ్చేవాళ్ళు కూడా, కాని నీకంటూ ఒకళ్ళున్నారని, నువ్వు అనాధవి కాదని చెప్దామని వచ్చాను."

సూరీడు అర్థం కానట్లుగా చూసాడు.

మాలతి కిటికీ దగ్గరకి వెళ్ళి ఇటువైపే చూస్తున్న బాలూని చూసి చెయ్యి ఊపింది. వాడు వెంటనే కిటికీ దగ్గరకి వచ్చాడు. సూరీడుతో చెప్పింది.

"కిటికీలోంచి బాలూ కనపడుతున్నాడా? బాగా చూడు."

సూరీడు తల కొద్దిగా ఎత్తి చూసి బాలూని గుర్తించాడు.

"నువ్వు వెళ్ళి చెట్టు కింద కూర్చో" ఆమె కొడుకుతో చెప్పింది. బాలూ వెళ్ళిపోయాడు.

"వాడు నీ కొడుకే సూరీడూ" మాలతి మృదువుగా చెప్పింది.

సూరీడు కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"పెళ్ళయిన వెంటనే తొమ్మిది నెలలకే వీడు పుట్టాడు. తర్వాత ఆరేళ్ళు దాటినా మళ్ళీ నాకు పిల్లలు పుట్టలేదు. రమణకి కూడా ఈ మధ్య అదే అనుమానం వచ్చినట్లుంది. వీడిని కొడుకుగా ఒప్పుకోలేక అలా అని నన్ను అనుమానించలేక బాలూని రోజూ కొడతాడు. నేను ప్రతీసారి 'కన్న కొడుకుని కొడతావేంటి?' అని అరుస్తుంటాను. ఆ మాట వినగానే రమణ వెటకారంగా నవ్వుతాడు. అర్థమైందిగా తప్పుచేసినా నన్ను తల్లిని చేసి పుణ్యం కట్టుకున్నావు. అందుకు కూడా థాంక్స్ చెప్తున్నాను. నువ్వు అనాధగా దిక్కుమాలిన చావు చావడంలేదు. నీకో కొడుకు ఉన్నాడు. వాడు నీలా రౌడీ వెధవ అవడు. పెద్ద ఉద్యోగి అవుతాడు. మిగిలిన రోజులు ఆ సంతృప్తితో బతుకు"

మాలతి లేచి బయటకి నడిచింది.

నలభై ఏళ్ళ బాలాజీకి తల్లిని చూస్తే ఓ అద్భుతాన్ని చూసినట్లుంటుంది. అతనికి తండ్రి లీలగా గుర్తున్నాడు. అతని కోపం కూడా. తన భవిష్యత్తు కోసం తల్లి చిన్న ఉద్యోగం చూసుకుని తండ్రికి దూరంగా వచ్చింది.

తనని శ్రద్ధగా చదివించి ప్రయోజకుడ్ని చేసింది. మళ్ళీ ఆ ఊరు ఎన్నడూ తీసుకెళ్ళలేదు.

కానీ, ఇల్లు వదిలి వచ్చేప్పుడు ఆ పెద్ద హాస్పిటల్‌కి ఎందుకు వెళ్ళారో, మంచం మీద పడుకుని ఉన్న ఆ అస్థిపంజరంలాంటి అతను ఎవరో, అసలు అది ఏ ఊరో కూడా బాలాజీకి తెలీదు.

కానీ ఏనాడూ అతను ఆ విషయం తల్లిని అడగలేదు. తనకి తెలియాల్సిన విషయమైతే అమ్మే చెపుతుంది అన్నది అతని విశ్వాసం.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments